క్లుప్తంగా

స్టీఫెన్ ఆనంద్‌కు ఎమ్మెల్యే కన్నబాబు అభినందన



ఎమ్మెల్యే కన్నబాబుతో స్టీఫెన్ ఆనంద్

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కాకినాడ రూరల్ రాయుడుపాలెంకు చెందిన ఎం.స్టీఫెన్ ఆనంద్‌ను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అభినందించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే కన్నబాబును మర్యాద పూర్వకంగా కలిసిన స్టీఫెన్ ఆనంద్ తనకు పదవి ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.

జనవరిలో భారీ వైద్య శిబిరం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో జనవరిలో కాజులూరు మండలం గొల్లపాలెంలో భారీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ తెలిపారు. స్థానిక రోటరీహాల్‌లో శనివారం క్లబ్ సమావేశం నిర్వహించారు. క్లబ్ సీనియర్ సభ్యులు మాచారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామారావు సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. వివిధ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు పరుపులు, తలగడలను అందించేందుకు సహకరించిన క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ తరుపున రోటరీ పోలియో ఫండ్‌కు రూ.10 లక్షలు అందించామన్నారు. ఆరు నెలలుగా నిర్వహించిన సేవా కార్యక్రమాలను క్లబ్ కార్యదర్శి చందు వివరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, మాజీ గవర్నర్ ఎస్‌పీఎస్‌రావు పాల్గొన్నారు.

భగవద్గీత విజ్ఞాన సంపద



కాలనీలో భగవద్గీత ప్రతులతో ఆధ్యాత్మిక వేత్త సుబ్బారావు, రత్నప్రసాద్, రాజా

కాకినాడ రూరల్: భారతీయ ప్రాచీన తాత్విక సాంస్కృతిక సంపద నిక్షిప్తమై ఉన్న భగవద్గీత ఒక విజ్ఞాన బాంఢాగారమని ఆధ్యాత్మిక వేత్తలు రవిశంకర్ పట్నాయక్, గల్లా సుబ్బారావు పేర్కొన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శ్రీరామ నామ క్షేత్రం ఆంధ్ర భద్రాద్రి, అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని గీతలోని సారాంశం తెలియజేశారు. శ్రీరామ నామ క్షేత్రం ఆంధ్ర భద్రాద్రి క్షేత్ర అధ్యక్షుడు రెడ్నం రాజా, అడబాల రత్నప్రసాద్‌లు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. వరలక్ష్మి, సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాస్మోపాలిటన్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: కాస్మోపాలిటన్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం రాత్రి జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా వై.లచ్చన్నచౌదరి, ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఎస్‌సీ చక్రరావు, సెక్రటరీగా పి.వెంకటరాజు, జాయింట్‌సెక్రటరీగా ఆర్ ఉజ్వలకుమార్, ట్రెజరర్‌గా బాదం జయరామ్‌గోపాల్, సభ్యులుగా జి.శేషగిరిరావు, పి.సుందరకిరణ్, సూర్యనారాయణ సోమయాజులు, ఎ.వెంకటభీమరాజు, గారపాటి రాయుడు, టి.వీర రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. నూతన సభ్యులను క్లబ్ సభ్యులు సత్కరించారు.

స్వర్ణలతకు డాక్టరేట్



బాలాజీచెరువు: వైజాగ్ గీతమ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.స్వర్ణలతకు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ డాక్టరేట్ అందజేసింది. రెమిడియల్ రోల్ ఆఫ్ ఎరిత్రోపోయిటిన్ అండ్ ఐరన్ ఇన్ ఎనీమియా విత్ క్రోనిక్ కిడ్నీ డిసీజ్ పేషంట్స్ ఆన్ మెయింటెనెన్స్ హెమోడయాలసిస్–ద రోల్ ఆఫ్ క్లినికల్ ఫార్మాసిస్ట్ ఇన్ అసెసింగ్ థెరప్యూటిక్ రెస్పాన్స్ అంశంపై ఆమె రిసెర్చ్ చేసింది. ఏయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, అసోసియేట్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ పర్యవేక్షణలో వాటిని సమర్పించారు.

ఆరు నెలల చిన్నారికి కోవిడ్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కొద్ది రోజుల క్రితం సాధారణ అనారోగ్యంతో చేరిన పెద్దాపురం మండలానికి చెందిన ఆరు నెలల బాలికకు కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. శనివారం ఈ నివేదిక ఆసుపత్రికి చేరింది. జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న బాలిక గత మూడు రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం కోలుకుంది. డిశ్చార్జి అనంతరం నివేదిక రావడంతో కుటుంబసభ్యుల నిర్ణయం మేరకు బాలికను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచారు.




రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పుష్పాలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



సర్పవరం జంక్షన్ వద్ద వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



కరప విష్ణ్వాలయంలో గీతాపారాయణ చేస్తున్న మహిళలు



కొంగోడులో శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



యండమూరులో మీసాల వేంకటేశ్వరుడు



భోగిగణపతిపీఠంలో పుష్పాలంకరణలో వెంకన్న

కనుల వైకుంఠం..



సర్పవరం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతరం స్వామి వారి నామాలు వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కరపలో వేణుగోపాలస్వామివార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

- వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- నేత్రపర్వం ఉత్తర ద్వార దర్శనం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

బోట్‌క్లబ్: ముక్కోటి దేవతల ఆశీస్సులు లభించాలని, ఉత్తర ద్వార నుంచి నారాయణనుడిని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు పోతాయని ప్రజల విశ్వాసం. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలన్నీ గోవింద నామస్మరణ మార్మోగాయి. ఆలయాల్లో ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరుచుకోవడంతో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం గ్రామోత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే ఆలయాలు వద్ద భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూకట్టారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ సీహెచ్ ఎస్.శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగన్నాథపురం, దేవాలయం వీధి, మెయిన్‌రోడ్డు, వెంకట్‌నగర్, రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో మరకత మణికంఠపీఠం, మెహర్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. వీటితోపాటు నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగాకుండా ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక భోగిగణపతిపీఠంలో పుష్పాలంకరణతో కలియుగ వైకుంఠ వేంకటేశ్వరస్వామి దివ్య రూపాన్ని రూపొందించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు.

కరప మండలంలో..

కరప: మండలంలోని వైకుంఠ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విష్ణ్వాలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి, అదేప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వరస్వామికి ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, సూర్యనారాయణ, గోపాలకృష్ణ విశేష పూజలు చేశారు. మహిళలు గీతాపారాయణం చేశారు. దేవదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, చీరట్ల శ్రీను భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. కరప పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండమూరు, పెనుగుదురు, జెడ్.భావారం, కూరాడ, చినమామిడాడ తదితర గ్రామాల్లోని భక్తులు ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు.

ఆలయాలకు వైకుంఠ ఏకాదశి శోభ

కాకినాడ రూరల్: వైకుంఠ ఏకాదశి శోభతో మండలంలో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులను అనుమతించడంతో బారులు తీరారు. జిల్లాలో పురాతన ప్రసిద్ధి చెందిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం, సర్పవరం జంక్షన్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, చీడిగలోని దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయం, పండూరు, తిమ్మాపురం గ్రామాల్లో విష్ణు ఆలయాలు, పలు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సర్పవరం, చీడిగ గ్రామాలలోని భావనారాయణస్వామి, దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి దర్శనాలు చేసుకున్నారు. సర్పవరంలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, కొప్పిశెట్టి గంగాధర్ తదితరులు ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులకు గజమాల వేసి స్వాగతం పలికారు. చీడిగలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులకు ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. వైకుంఠ నారాయణుడి ఆశీస్సులు అందరికి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కన్నబాబు వెంట తండ్రి సత్యనారాయణ, సోదరుడు కల్యాణ్ తదితరులు ఉన్నారు.

కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

కరప: స్థానిక విష్ణ్వాలయంలో శనివారం రాత్రి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల వార్షిక కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈఏడాది ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి, స్వామివారి వార్షిక కల్యాణం ఒకేరోజు రావడం విశేషమన్నారు. వేణుగోపాలస్వామిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజాకార్యక్రమాలు చేశారు. రాత్రి వేణుగోపాలస్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించి, కల్యాణ క్రతువు ఘనంగా జరిపారు. ఈఓ కె.తిరుమల రవితేజ ఏర్పాటన్లు పర్యవేక్షించారు. కరప పరిసర భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

క్రీడా స్ఫూర్తిని పెంచేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- ర్యాలీలో పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, జేసీ, కమిషనర్
- లక్షన్నరకు పైగా పోటీలకు రిజిస్ట్రేషన్లు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, జేసీ ఇలక్కియా, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి, కమిషనర్ నాగనరసింహారావు, విద్యార్థులు

కాకినాడ: మరుగున పడుతున్న సాంప్రదాయ క్రీడలకు గుర్తింపు తెచ్చి గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా ఉద్యమానికి శ్రీకారం చుట్టారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజా ట్యాంకు పార్కు నుంచి ఆనందభారతి గ్రౌండ్స్ వరకూ శనివారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జేసీ ఇలాక్కియా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1.56 లక్షల మంది, సిటీలో 13 వేల మంది ఆడుదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. యువత అన్నింటా ఉండి, క్రీడా నైపుణ్యానికి పదును పెట్టాలని ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపునిచ్చారు. జేసీ ఇలక్కియా మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు. గ్రామీణ స్థాయిలో సచివాలయ పరిధి నుంచి పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కాకినాడ జిల్లాలో లక్ష మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, పోటీలు ప్రారంభానికి ముందు కూడా స్పాట్ రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. సాంప్రదాయ క్రీడలకు మరింత గుర్తింపు తెచ్చే లక్ష్యంతో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. వందలాది మంది విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ పి.వెంకటలక్ష్మి, జిల్లా ఐటీ సెల్ చైర్మన్ బీర కృష్ణప్రియ, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణ మోహన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యులు భామిరెడ్డి, అధికారులు, విద్యార్థులు హాజరయ్యారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటును అందిస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మసీదు సెంటర్‌లోని సీరత్ కమిటీ ఆవరణలో రూ.44 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపం లిఫ్ట్, పీహెచ్‌సీ ఉచిత ఆరోగ్య కేంద్రం, మదరసా, కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ఎమ్మెల్యే ద్వారంపూడి శనివారం రాత్రి ప్రారంభించారు. శీరత్‌కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ ఆలీ, కార్యదర్శి ఇజాజుద్దీన్, కోశాధికారి మదని ఖాన్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, నగర మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, జిల్లా వక్ఫ్‌కమిటీ అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వ్యక్తిగత విషయాల్లో కులం ప్రస్తావన తేవొద్దు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీరామమూర్తి

బోట్‌క్లబ్: ఎక్కడ ఏ విషయం జరిగిన దానిలో కాపు కులం ప్రస్తావన తేవొద్దని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ఒక హోటల్‌లో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత విషయాలకు కూడా కులం ప్రస్తావన ఎందుకు తెస్తున్నారని మండిపడ్డారు. వార్పు రోడ్డులో పెట్రోల్ బంక్ విషయంలో గొడవ జరిగితే దానికి కాపులను వ్యాపారం చేయనివ్వడం లేదని ఎందుకు స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారని ప్రశ్నించారు. కాపులు ఒక పార్టీకి చెందిన వారు కాదని కాపులు అన్నీ పార్టీల్లో ఉన్నారన్నారు. ఎక్కడా కాపు కులస్తులను ఇబ్బందికి గురి చేస్తే కాపు సంఘానికి ఫిర్యాదు చేస్తే తాము పోరాటం చేస్తామన్నారు. కానీ సొంత విషయాలకు కూడా కులం పేరు ఎందుకు వాడుతున్నారన్నారు. కాపు కులస్థులకు ఏ అవసరం వచ్చిన కాపు సంఘాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వ్యాపార లావాదేవీల్లో వచ్చిన విషయాలకు కూడా ఏవో అభియోగాలు చెప్పి కులం పేరును వాడుకోవడం సబబుగా లేదన్నారు.

టీడీపీ-జనసేన కూటమిని నమ్మొద్దు

- వై ఏపీ నీడ్స్ జగన్‌లో ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమికి ఓటు వేస్తే భవిష్యత్ అంధకారమేనని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 31వ డివిజన్ రాగంపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రాంతంలో శనివారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పథకాలను వివరించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగనన్న సంక్రాంతి సంబరాల ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గర్రే బాబ్జి, లావేటి అమర్, నీలాపు కిషోర్, మర్రిపూడి రమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కరప: మండలం కొరిపల్లి, జెడ్.భావారం గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు, మండల స్థాయి అధికారలు పర్యటించి వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రానివారుంటే, తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. దేశనాయకుల వేషధారణతో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్ గాంధీ, ముమ్మిడి పెద్దకాపు, సర్పంచులు పలివెల నాగేశ్వరరావు, కొత్త నాగలక్ష్మి, ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాష్ కరప పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, కార్యదర్శి పి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కాకినాడ చరిత్ర పుస్తకావిష్కరణ



కాకినాడ చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు, రచయిత ర్యాలీ ప్రసాద్

బాలాజీచెరువు: చారిత్రక పరిశోధకులు, నగరానికి చెందిన ర్యాలీ ప్రసాద్ రచించిన పరిశోధక గ్రంథం కాకినాడ చరిత్ర పుస్తక ఆవిష్కరణ శనివారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ కాకినాడ పట్టణం పౌరాణిక కాలం నుంచి నేటి వరకూ ఉన్న చరిత్రను ఈ పుస్తకంలో అద్భుతంగా రచించారని, ఈ పుస్తకాన్ని చదివి కాకినాడ చరిత్రను తెలుసుకోవచ్చన్నారు. ప్రముఖ రచయిత్రి పుప్పాల సూర్యకుమారి మాట్లాడుతూ స్మార్ట్‌సిటీగా ఎదిగిన కాకినాడ గురించి నేటి తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రచయిత ర్యాలీ ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడలో విదేశీయలు సంచారంతో పాటు వందే మాతర ఉద్యమం, వంటి కీలకమైన ఘట్టాలు అన్ని పొందుపరిచామన్నారు. ఈ గ్రంథాన్ని శేషారెడ్డి లక్ష్మీరాజ్యం దంపతులకు అంకితమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, పాలిశెట్టి మల్లిబాబు, గొడవర్తి సత్యమూర్తి, మార్ని జానకిరామయ్య చౌదరి పాల్గొన్నారు.

'తేతలి'కి జీవిత సాఫల్య పురస్కారం



సత్యనారాయణరెడ్డికి పురస్కారం అందిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: ప్రముఖ కంటి వైద్యులుగా పేరొందిన తేతలి సత్యనారాయణరెడ్డిని స్థానిక దంటు కళాక్షేత్రంలో శనివారం సత్కరించారు. ఏటా యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ మాజీ అధ్యక్షుడు దంటు సూర్యారావు జయంతి సందర్భంగా అందించే జీవిత సాఫల్య పురస్కారాన్ని తేతలి సత్యనారాయణరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా యంగెమ్మన్స్ హ్యాపీ క్లబ్ ఉపాధ్యక్షులు పట్నాల రామచంద్రరావు మాట్లాడుతూ లక్ష మందికి కంటి ఆపరేషన్లు చేసి అనపర్తి కంటి డాక్టర్‌గా ప్రసిద్ధిగాంచిన తేతలి సత్యనారాయణరెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలికాని స్టాలిన్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత శేషారెడ్డి పాల్గొన్నారు.

సిటీ క్లస్టర్ యూత్ అధ్యక్షులు వీరే..

కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు క్లస్టర్ల యువజన విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నియామకాలు జరిగాయి. ఆయా క్లస్టర్ల అధ్యక్షులుగా కోనాడి దుర్గాప్రసాద్(క్లస్టర్-1), చెక్కా చక్రవర్తి(క్లస్టర్-2) మిడిమళ్ళ మీరకుమార్ (క్లస్టర్-3), జేడీ పవన్‌కుమార్ (క్లస్టర్-4)లను నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

పౌష్టికాహారం పంపిణీ

కాకినాడ క్రైం: హెచ్‌ఐవీ బాధితులు, ఆ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు శనివారం పోషకాహార పంపిణీ చేశారు. ఆయా వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఛేంజెస్ స్వచ్ఛంద సంస్థ శనివారం కాకినాడలోని ఛేంజెస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న హాజరయ్యారు. ప్రాజెక్టు మేనేజర్ దుర్గాభవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎల్‌వో రోణంకి రమేష్, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా ప్రోగ్రాం అధికారి ఆదిలింగం, ఉష ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాంబాబు, ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ కుమారి, ఛేంజెస్ ఎంఈడీ శివ, వలంటరీ హెల్త్ సర్వీసెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కళాశాల ఆడిటోరియంలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో 1991–95ల బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులందరూ శనివారం కళాశాలలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉన్నత హోదాలలో ఉన్నవారందరూ కలిసి ఆ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ప్రస్తుతం చివరి సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేసి రూ.2లక్షల విలువగల నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు, నన్నయ్య వర్సిటీ వీసీ పద్మరాజు, రెక్టార్ కేవీ రమణ పాల్గొన్నారు.

సబ్‌జైలులో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

కాకినాడ లీగల్: ఖైదీల నేర ప్రవృత్తిని తగ్గించడానికి కాకినాడ స్పెషల్ సబ్‌జైలులో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్లు ఖైదీల్లో పరివర్తనకు దోహదపడతాయని సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు మాట్లాడుతూ నేర ప్రవృత్తిని వదిలి సమాజంలో గౌరవంగా జీవించాలని అన్నారు. డాక్టర్ సైకాలజిస్ట్ వి.వరప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలకు రిమాండ్‌లో జీవన నైపుణ్యాన్ని నేర్పాలన్నారు. ఖైదీలకు కౌన్సిలింగ్ సమయంలో కుటుంబ సభ్యులు కూడా ఉంటే ప్రయోజనముంటుందని అన్నారు. జీజీహెచ్ ప్రొఫెసర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కాకినాడ: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ బ్రాంచ్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. స్థానిక శాంతిభవన్‌లో సంఘ ప్రాంతీయ అధ్యక్ష, కార్యర్శులు కె.రమేష్ బాబు, ఐ.నాగేశ్వరరావు సమక్షంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎం.శ్రీనుబాబు, కార్యదర్శిగా జీవీ రామకృష్ణారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాజమహేంద్రవరం పట్టణ, రూరల్, అమలాపురం, రామచంద్రపురం ప్రాంతాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ ప్రతినిధులు సింహాచలం, తిలక్, దేవానంద్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కూరాడ సర్పంచ్ మృతి



వెంకటరమణ (కొండ)

కరప: కూరాడ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి వెంకటరమణ(కొండ)(63) శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం 6.30 గంటలకు గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకటరమణ భౌతికఖాయం వద్ద గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, పంచాయతీ సిబ్బంది, వార్డుసభ్యులు నివాళులర్పించారు. స్థానిక నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెంకటరమణ భౌతికఖాయానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. వెంకటరమణ మరణం పార్టీకి తీరని లోటన్నారు. గ్రామమాజీసర్పంచ్ రావుల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ పార్టీనాయకులు పెంకే సత్తిబాబు, గుత్తుల బాలాజీ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.